క్లుప్తంగా

న్యాయమూర్తుల కొరత లేకుండా చూడాలి



జస్టిస్ రాజశేఖరరావుతో జిల్లా న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం జిల్లా కోర్టు ప్రాంగణంలో జూనియర్ జ్యూడీషియల్ న్యాయమూర్తుల కొరత లేకుండా చూడాలని, అన్ని కోర్టుల్లో న్యాయమూర్తుల పోస్టులు భర్తీ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని జిల్లాకు చెందిన న్యాయవాదులు కోరారు. ఈ మేరకు విజయవాడలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.రాజశేఖరరావుని సోమవారం కలిశారు. న్యాయమూర్తిని కలిసినవారిలో జిల్లా బార్ అసోసియేషన్ న్యాయవాదుల బృందం, గేదెల వాసుదేవరావు, వాన కృష్ణచంద్, మామిడి క్రాంతి తదితరులు ఉన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో నూతన జడ్జిగా సోమవారం ప్రమాణం స్వీకారం చేసిన జస్టిస్ గేదెల తుహిన్ కుమార్‌ను కలిసి అభినందనలు తెలియజేశారు.

దుకాణాల తొలగింపు



దుకాణాలను తొలగిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: మండలంలోని చిలకపాలేం జంక్షన్‌లో ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద, రోడ్డుపైన ఉన్న దుకాణాలను సోమవారం తొలగించారు. ఇక్కడ ట్రాఫిక్‌కు నిరంతరం అంతరాయం కలుగుతుండడంతో అడ్డంగా ఉన్న దుకాణాలను ప్రోక్లెయినర్ సాయంతో ఆర్అండ్‌బీ అధికారులు తొలగించారు. రోడ్లపైన దుకాణాలను పెట్టకూడదని, అలా పెట్టడం వలన ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధి



పనులు ప్రారంభిస్తున్న గ్రామస్తులు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని మురపాక గ్రామంలో దివంగత తేనెల మంగయ్యనాయుడు జ్ఞాపకార్థం ఆయన కుమారులు తేనెల సురేష్‌కుమార్, సత్యమూర్తి, విద్యాసాగర్‌లు రూ.2.50 లక్షల సొంత నిధులతో గ్రామంలోని శ్మశానవాటిక అభివృద్ధి పనులను చేపట్టారు. తమ తండ్రి ఆశయ లక్ష్యసాధనలో భాగంగా ఈ పనులను చేపట్టామని సోమవారం వీరు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని మురపాక గ్రామంలో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇళ్లులు కాలిపోయినా బాధితులకు సహృదయ ఫౌండేషన్ సహకారంతో పిలుపు స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. సహృదయ సంస్థ చైర్మన్ బిందు ఆర్థిక సాయంతో పిలుపు స్వచ్ఛంద సంస్థ చైర్మన్ రవికుమార్ ఆధ్వర్యంలో నాలుగు కుటుంబాలకు రెండు నెలలకు సరిపడా సరుకులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ జాయింట్ సెక్రటరీ పెయ్యిల లక్ష్మణరావు, లావేరు ఎంపీటీసీ సతీష్, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు శ్రేష్టమైనవి



తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సీతామహలక్ష్మి

శ్రీకాకుళం అర్బన్: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమైనవని, వీటిలో ఎటువంటి కల్తీ ఉండదని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు కృష్ణా పార్క్ సెక్టార్ పర్యవేక్షకురాలు పి.సీతా మహాలక్ష్మి అన్నారు. నగరంలోని బర్మా కాలనీ యూహెచ్‌సీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు సోమవారం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రిపాలు ఇవ్వడం వలన వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలియజేశారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ స్టాఫ్ నర్స్ మాధవి, ఏఎన్‌ఎం జ్యోతి, ఆశ కార్యకర్త కె.బుజ్జమ్మ, పారా మెడికల్ సుధాకర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఎస్.రమేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆదిలక్ష్మి, సంధ్యారాణి, పైడి రాజు, సునీత, విజయలక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియం వైపు.. రైతన్న చూపు..!



ఘన జీవామృతాన్ని తయారు చేస్తున్న మహిళలు

- ప్రకృతి వ్యవసాయంపై పెరుగుతున్న ఆసక్తి
- ఆరోగ్యకరమైన ఉత్పత్తులకు ప్రజల్లో ఆదరణ
- ఏడాదికేడాది పెరుగుతున్న సాగు విస్తీర్ణం



ద్రవ జీవామృతాన్ని తయారు చేస్తున్న రైతులు

ఎచ్చెర్ల: మండలంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు ఆసక్తి పెరుగుతోంది. ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను ప్రజలకు అందించడం, భూసారాన్ని పరిరక్షించడానికి ప్రకృతి వ్యవసాయం ఉపయోగకరంగా ఉంటుంది. దీంతో ప్రకృతి వ్యవసాయం సాగు విస్తీర్ణం ప్రతీ ఏడాది పెరుగుతూ వస్తోంది. ప్రకృతి వ్యవసాయం వలన ఖర్చులు తగ్గడం, దిగుబడులు పెరగడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం 22 గ్రామ పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. స్వయం సహాయక సంఘాల్లోని సభ్య రైతులతో పాటు ఇతర రైతులు కూడా ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించారు. మండలంలోని కేశవరావుపేట, ఫరీదుపేట, ఎస్ ఎంపురం, ధర్మవరం, పొన్నాడ, తమ్మినాయుడిపేట, కొత్తపేట, కొంగరాం తదితర ప్రాంతాల్లో ఎక్కువగా సాగు చేస్తున్నారు.

సహజ ఎరువుల వినియోగం

పంటల సాగుకు ప్రకృతి సిద్ధంగా లభించే పదార్థాలు, ద్రవాలతో తయారు చేసిన ఎరువులు, క్రిమి సంహారక కషాయాలను వినియోగిస్తున్నారు. రసాయనిక ఎరువుల కంటే ఇవి తక్కువ ధరకు లభిస్తుండడంతో వీటిపై దృష్టి నిలిపారు. జీడిమామిడి పూతలపై పురుగుల నివారణకు, పూత నిలవడానికి మజ్జిగ, ఇంగువ, బెల్లం మిశ్రమ ద్రావణాన్ని, ఎరువుగా వాడడానికి ఆవుపేడ, బెల్లం, పప్పు దినుసుల పిండి, తగినంత గోమూత్రాన్ని కలిపి మిశ్రమంగా తయారుచేసిన ఉండలను వాడుతున్నారు. అలాగే వీటికి నీటిని కలిపి తయారు చేసిన ద్రవ జీవామతాన్ని పంటలపై చీడ, పీడల నివారణకు, పంట బలంగా ఎదిగేందుకు వినియోగిస్తున్నారు. అగ్గి తెగులు నివారణకు మారేడు కషాయం, వరిలో సుడిదోమ నివారణకు రేడియో మొక్కల ఆకులతో తయారు చేసిన కషాయం, వైరస్ నివారణకు పేడ కషాయం, పురుగుల నివారణకు నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్నిఅస్త్రం వంటి కషాయాలను వినియోగిస్తున్నారు. వీటిని కొందరు రైతులు స్వయంగా తయారు చేసుకుంటున్నారు. మరికొందరు ఆయా గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం వారు ఏర్పాటు చేసిన మినీ దుకాణాల ద్వారా కొనుగోలు చేసుకుని వ్యవసాయానికి వినియోగిస్తున్నారు.

మార్కెట్ విస్తరణ

గ్రామాల్లో ప్రకృతి సిద్ధంగా పండిన పంటల గురించి ఇతర ప్రాంతాల ప్రజలు తెలుసుకొని ఉత్పత్తులను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. దీంతో రైతులు తమ ఉత్పత్తులకు మంచి మార్కెట్ లభిస్తోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరింత మంది ప్రకృతి వ్యవసాయానికి మొగ్గు చూపేలా వెలుగు, ప్రకృతి వ్యయసాయ విభాగం అధికారులు, సిబ్బంది గ్రామాల్లో అవగాహన ర్యాలీలు, సమావేశాలను నిర్వహించి ప్రోత్సహిస్తున్నారు. దీంతో మరింత మంది రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు ఆసక్తి చూపుతున్నారు.

భూమికి మేలు



ప్రకృతి వ్యవసాయం వలన భూమికి మేలు జరుగుతుంది. తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన ఆకుకూరలు సాగవుతున్నాయి. పట్టణం, దూర ప్రాంతాల నుంచి మా గ్రామాల మీదుగా వెళ్లేవారు ఇక్కడ వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఆశించిన రాబడి వస్తోంది.

– రామచంద్రరావు, రైతు, కేశవరావుపేట

పూర్తిస్థాయిలో సాగుకు కృషి



ఎచ్చెర్ల మండలంలోని 22 పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. మిగిలినవారు పాక్షికంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తున్నారు. అయితే పూర్తిస్థాయిలో ప్రకృతి వ్యవసాయానికి కృషి చేస్తున్నాం. రైతుల్లో నమ్మకం పెరగడం వలన గతేడాది కంటే ఈసారి సాగు విస్తీర్ణం పెరిగింది.

– సీహెచ్ సూర్యనారాయణ, ఎస్‌డీపీ, ప్రకృతి వ్యవసాయం

ఆన్‌లైన్ వర్క్ చేయలేము



సెల్‌ఫోన్లు అప్పగించేందుకు వచ్చిన అంగన్‌వాడీ కార్యకర్తలు

- ఫోన్లు అప్పగించిన అంగన్‌వాడీ కార్యకర్తలు

ఎచ్చెర్ల: అంగన్‌వాడీల్లో చిన్నారుల హాజరు, లబ్ధిదారులకు ఆహారం సరఫరా వివరాలను రికార్డుల్లో రాస్తామని, ఆన్‌లైన్‌లో నమోదు చేయలేమని తెలియజేస్తూ తమ ఫోన్లను ఎచ్చెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయానికి కార్యకర్తలంతా సోమవారం అప్పగించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని కోరారు. కొత్తగా మాతృ వందనం పథకం అమలు చేయలేమని తెలియజేశారు. అంగన్‌వాడీ సెంటరు నిర్వహణకు ఇచ్చిన ఫోన్లలో పోషణ ట్రాకర్, బాల సంజీవని యాప్‌లు సపోర్టు చేయడం లేదన్నారు. లబ్ధిదారులకు ఓటీపీ, ముఖ గుర్తింపు ద్వారానే సరుకులు ఇవ్వాలని పెట్టిన నిబంధన అమలు చేయడానికి అనేక ఇబ్బదులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సరుకులన్నీ ఒక్కసారిగా రావడం లేదని, అలాగే నెట్ సిగ్నల్ లేకపోవడం, సర్వర్ పనిచేయకపోవడంతో లబ్ధిదారులు కూడా ఇబ్బంది పడుతున్నారన్నారు. దేశమంతా పోషణ ట్రాకర్‌కు ఒకే యాప్ ఉంటే, మన రాష్ట్రంలో మాత్రం ఎక్కువ యాప్‌లు పెట్టారని వాపోయారు. అందువలన తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు వై.విజయలక్ష్మి, చంద్రమౌళి, కనకం, శారద, రాములమ్మ, సరస్వతి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

పీఎం మోదీ వ్యాఖ్యలు హాస్యాస్పదం



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి

శ్రీకాకుళం అర్బన్: పార్లమెంట్‌లో జరుగుతున్న విషయాలతో పాటు ఇటీవల నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ విజయవంతమైందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందని కేంద్ర మాజీ మంత్రి డా.కిల్లి కృపారాణి అన్నారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన భవన్‌లో విలేకరుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్డీఏ హయాంలో ఆర్థిక, రక్షణ వ్యవస్థలతో పాటు విదేశాంగ విధానం కూడా పూర్తిగా నిర్వీర్యమైందని పేర్కొన్నారు. 2014 నుంచి కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందని, పీవోకేను ఎందుకు స్వాధీనం చేసుకోలేకపోయారో చెప్పాలని డిమాండ్ చేశారు. మన రాష్ట్రానికి చెందిన కూటమి ఎంపీలు రాష్ట్ర ప్రయోజనాలు కోసం ప్రశ్నించకపోవడం బాధాకరమన్నారు.

సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గాదం వెంకట త్రినాథరావు, రెల్ల సురేష్, కిల్లి రామ్మోహన రావు తదితరులు ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్ఐ గంగరాజు

గార: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చదువుతో పాటు లక్ష్యంపై దృష్టి సారించాలని ఎస్ఐ సీహెచ్ గంగరాజు సూచించారు. మండలంలోని కళింగపట్నం కోకా వారి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నారీశక్తి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. మహిళలపై జరుగుతున్న నేరాలు, వాటిని ఎదుర్కొనే విధానాలపై తెలియజేశారు. సైబర్ క్రైమ్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. ఏదైనా ఇబ్బందులు ఏర్పడితే గోల్డెన్ అవర్‌లోనే స్పందించాలన్నారు. పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వైవీఎల్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

గారలో కార్డన్ సెర్చ్

మండల కేంద్రంలో సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఏడు వాహనాలకు సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో సీజ్ చేశామని ఎస్ఐ గంగరాజు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సత్యనారాయణ

సారవకోట: ప్రకృతి వ్యవసాయ విధానాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పి.సత్యనారాయణ సూచించారు. గత మూడు రోజుల నుంచి బుడితి రైతు సేవా కేంద్రంలో మండలంలోని అగ్రికల్చర్ అసిస్టెంట్లకు ఇస్తున్న శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకం ఎక్కువగా పెరగడంతో నేల సారం తగ్గుతుందన్నారు. ప్రజలు పలు రోగాల బారిన పడుతున్నారన్నారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులతో ఆరోగ్యకరమైన పంటలు పండుతాయన్నారు. మాస్టర్ ట్రైనీ రమణ పాల్గొన్నారు.

బెయిల్ మంజూరు హర్షణీయం



వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ ప్రధాన కార్యదర్శి ప్రతి అన్వేష్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మతమార్పిడి వంటి తప్పుడు ఆరోపణలతో కేరళకు చెందిన ఇద్దరు సిస్టర్స్‌ని అకారణంగా అరెస్ట్ చేసి, 5 రోజుల పాటు జైల్లో ఉంచడం అన్యాయమని వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ ప్రధాన కార్యదర్శి ప్రతి అన్వేష్ అన్నారు. అరెస్ట్ చేసినవారికి బిలాష్‌పూర్ హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దీంతో న్యాయ వ్యవస్థపై ప్రజలకు మరింత విశ్వాసం పెరిగిందన్నారు.

శివానీలో వర్క్‌షాప్ ప్రారంభం

ఎచ్చెర్ల: చిలకపాలేంలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం డేటా స్ట్రక్చర్ అండ్ ఆల్గారిథమ్స్ విత్ పైథాన్ అనే అంశంపై వర్క్‌షాప్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి బ్రెనో విజన్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ కంపెనీ నుంచి నలుగురితో కూడిన బృందం విచ్చేశారు. విద్యార్థులు ఉద్యోగానికి కావాల్సిన టెక్నికల్ స్కిల్స్ మరింత పెంపొందించడానికి ఈ వర్క్‌షాప్ దోహదపడుతుందని బ్రెయిన్ విజన్ రీసోర్స్‌పర్సన్ సాయిపవన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ జి.టి.చంద్రశేఖర్, హెచ్‌వోడీ ప్రదీప్, టీపీవో బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాలపోలమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న గ్రామస్తులు

సారవకోట: మండలంలోని మదనాపురం గ్రామంలో సోమవారం పాలపోలమ్మ అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తుంతా సుమారు రూ.20 లక్షలు వెచ్చించి నిర్మించిన ఈ ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం గత మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్నారు. అమ్మవారి దర్పదర్శనం, నిజ దర్శనాన్ని రుత్వికులు చేపట్టారు.

పరామర్శ

రణస్థలం: మండలంలోని పాతర్లపల్లి గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ గొర్లె లక్ష్మణరావు ఇటీవల మరణించారు. దీంతో ఆ కుటుంబాన్ని విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సోమవారం పరామర్శించారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ నాయకుడు పిన్నింటి సాయికుమార్, రణస్థలం జెడ్పీటీసీ టొంపల సీతారాం, నాయకులు చిల్ల వెంకటరెడ్డి, మహంతి చినరామినాయుడు, రెడ్డి అప్పలనాయుడు, పిన్నింటి లక్ష్మంనాయుడు, ఇప్పిలి నరసింహమూర్తి, గొర్లె శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



లక్ష్మణరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ బెల్లాన

గుజరాతీపేటలో క్యూ ఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు



నిరుద్యోగ యువతను నిండా ముంచారు



బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు ఎన్నో హామీలు గుప్పించిన చంద్రబాబు నాయుడు, అధికారంలోకి వచ్చాక వాటిని మరిచారని శ్రీకాకుళం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి అన్నారు. నగరంలోని 41వ డివిజన్ ఇన్‌చార్జి గద్దిబోయిన కృష్ణయాదవ్, 33, 34వ డివిజన్ల ఇన్‌చార్జి ఇంతియాజ్ భాషా ఆధ్వర్యంలో కాకివీధి, గుజరాతీపేట, మంగువారి తోటల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతను నిండా ముంచిందని పేర్కొన్నారు. నిరుద్యోగ భృతి అమలు చేయాలనే విషయాన్ని మరిచారని మండిపడ్డారు. చంద్రబాబు చరిత్ర అంతా మోసం, దగా, వెన్నుపోటులే ఉన్నాయని పేర్కొన్నారు. కూటమి పాలకుల అన్యాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు సాధు వైకుంఠరావు, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎంఏ బేగ్, ఎన్ని ధనుంజయరావు, కర్రి రంగాజీదేవ్, నియోజకవర్గ అధ్యక్షుడు ముజీబ్ రెహమాన్, కామేశ్వరి, కింజరాపు రమేష్, భరద్వాజ్, తోట తారక్, అప్పన్న యాదవ్, రామారావు, బొంగు సత్యనారాయణ, బంటుపల్లి కృష్ణారావు, హేమ, చందు, సుందర్, రాము, మహిబుల్లాఖాన్, చామర్తి భాస్కర్, రుప్ప శేషగిరి, కర్నేన హరి, బహదూర్ జానీ, లావేటి శ్యామ్, వానపల్లి రమేష్, కిల్లి నాగు, వనిత తదితరులు పాల్గొన్నారు.

ఏడాది కాలంగా ప్రజలకు మోసం



కూటమి ప్రభుత్వ మోసాలపై నినదిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

రణస్థలం: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఏడాది కాలంగా ప్రజలను మోసం చేస్తోందని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నారువ, మెంటాడ పంచాయతీల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ప్రజల వద్దకు వెళ్లి క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయించి సీఎం చంద్రబాబు చేసిన మోసాలను వీడియో రూపంలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను మోసగించడమే చంద్రబాబు నైజమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ధ్వజమెత్తారు.

కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి పిన్నింటి సత్యం నాయుడు, నాయకులు దన్నాన హరి, ముద్దాడ రాజశేఖర్, సర్పంచ్‌లు బాకి సూర్యనారాయణ రెడ్డి, గొర్లె అప్పలనర్సునాయుడు, అల్లిపల్లి అప్పన్న, ఆళ్ల అసిరయ్య, పాల రాము, పాల ముసలయ్య, నిద్రబంగి సత్యం, పాల అరుణకుమారి, లంకలపల్లి శంకర్, దోని అప్పన్న, బాకి అర్జున రెడ్డి, సీరపు మల్లేశ్, ముక్కు తాతారావు, దామోదర్, టేకి బ్రహ్మాజీ, దన్నాన సీతారాం, కొత్తకోటల పర్సినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కూటమి నాయకులకు బుద్ధి చెప్పాలి



సేతుభీమవరంలో క్యూ ఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

జి.సిగడాం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయని కూటమి నాయకులకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ అన్నారు. మండలంలోని సేతుభీమవరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు దోలవెంకటరమణ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు.

హామీలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ప్రతిపక్ష నాయకులపై రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. నిరుద్యోగ యువత, ఆడబిడ్డలను మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు తొత్తడి రామారావు, ఇప్పిలి త్రినాథరావు, నాయకులు పాగతోక రాంబాబు, పైల ఆదినారాయణ, పైల త్రినాథరావు, బొల్లు రమణ, మరుపల్లి కనకరావు, బొల్లు రమేష్, బొల్లు జమ్మినాయుడు, బెవర సూరిబాబు, సిద్దపు సన్యాసిరావు, పైల గణేష్, బొల్లు చిన్న రమణ, బొల్లు నర్సింగరావు, బొల్లు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే జి.సిగడాం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెలిది సాయిరాం, ఎంపీటీసీ కీర్తి సత్యంనాయుడు, నాయకులు దుర్గాశి రామినాయుడు, తొండ్రోతు సత్తిబాబు, పిన్నింటి రామినాయుడు, పిన్నింటి నారాయణరావు, కెల్ల చిన్న, తొండ్రోతు సురేష్, కీర్తి గౌరీశంకరావు, అంపోలు సూరిబాబు, కీర్తి లీలాకృష్ణ, మజ్జి గురినాయుడు, కారు నాగరాజు, ఉమ తదితరులు పాల్గొన్నారు.



జి.సిగడాం: బీసీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను వివరిస్తున్న నాయకులు